## కేంద్ర బడ్జెట్లో తెలంగాణకు గుండు సున్న మైనారిటీలకు మొండి చేయి...

- **రాష్ట్ర మైనార్టీ నాయకులు డా.నయీమ్ ఖురేషి.**



భద్రాద్రి కొత్తగూడెం / కొత్తగూడెం / ఫిబ్రవరి 2 / అక్షరం న్యూస్ –:

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశ పెట్టిన 53.47 లక్షల కోట్ల బడ్జెట్లో తెలంగాణ తో పాటు దేశంలోని మైనార్టీలకు మొండి చేయి చూపించిందని రాష్ట్ర మైనార్టీ నాయకులు నయీమ్ ఖురేషి విమర్శించారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రధానిగా నరేంద్ర మోడీ వచ్చాక మైనార్టీలపై ప్రత్యక్షంగా వివక్ష సాధింపు ధోరణి స్పష్టంగా అమలు చేస్తున్నట్లు ఆరోపించారు. రాష్ట్రం నుండి కేంద్రానికి వెళ్లే కోట్ల రూపాయల పన్నులు వెళ్తున్నప్పటికీ తిరిగి నిధులు కేటాయించడంలో కేంద్రం మరోసారి తెలంగాణ పట్ల వివక్ష చూప్పిందని ఆయన పేర్కొన్నారు. విభజన హామీలైన కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు పరిశ్రమ ఊసే ఎత్తకపోవడం కేంద్ర ప్రభుత్వం చిత్తశుద్ధిలేని నిదర్శనమని అన్నారు. వ్యవసాయ రంగంతో పాటు రైల్వే లైన్లు కోచ్ ఫ్యాక్టరీ విమానాశ్రయాల అభివృద్ధి భారత్ ఫ్యూచర్ సిటీ మెట్రో కారిడార్ నిరుద్యోగం రూపుమాపేందుకు ఉద్యోగ ఉపాధి మార్గాలు జాతీయ రహదారులకు బడ్జెట్లో ఏమాత్రం కేటాయింపులు లేకపోవడం, మధ్యతరగతి వ్యక్తిగత ఆదాయత పన్ను లో ఎటువంటి వేసులుబాటు ఇవ్వకపోవడం, నిరుద్యోగం పెరుగుదల పెట్రోల్ డీజిల్ ధరలను జిఎస్టి పరిధిలోకి తీసుకురాకపోవడం వల్ల నిత్యావసర ధరలు సామాన్యుడికి అందుబాటులో లేకుండ పోతున్నాయని దేశంలో నిరుద్యోగం పెరుగుతుంటే యువతకు ఉపాధి కల్పించే నిర్దిష్ట ప్రణాళిక బడ్జెట్లో పొందు పరచలేదని ఇది పూర్తిగా కార్పొరేట్ అనుకూల బడ్జెట్ అని నయీమ్ ఖురేషి అభివర్ణించారు.

## నేడు భగవాన్ శ్రీ సత్యసాయి ప్రేమ ప్రవాహిని రథయాత్ర




జనగామ జిల్లా/రఘునాథపల్లి,/( అక్షరం న్యూస్) ఫిబ్రవరి 02: మండలంలో మంగళవారం భగవాన్ శ్రీ సత్యసాయి ప్రేమ ప్రవాహిని రథ యాత్ర నిర్వహిస్తున్నట్లు నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు. రథ యాత్రలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. మండలంలోని ఖిలాషాపూర్ లో మంగళవారం ఉదయం 9 గంటలకు రథ యాత్ర ప్రారంభవ వుతుందని, రఘునాథపల్లికి ఉదయం 11.45 గంటలకు, ఎల్లారెడ్డిగూడెంకు మధ్యాహ్నం 12.45 గంటలకు, మధ్యాహ్నం 2.15 గంటలకు శ్రీమన్నారయణపురం, 3.45 గంటలకు నిడిగొండ గ్రామంలోని కుర్మగూడెంకు రథయాత్ర చేరుకుంటుందని నిర్వాహక కమిటీ సభ్యులు వివరించారు.

## నేటితో ముగియనున్న నామినేషన్ల ఉపసంహరణ, బి ఫారంల సమర్పణ ...

- **మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్**




కరీంనగర్/జమ్మికుంట/ఫిబ్రవరి 02/అక్షరం న్యూస్:

జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలో నామినేషన్ లు వేసిన అభ్యర్థులు మంగళవారం మధ్యాహ్నం 3గంటల వరకు ఉపసంహరించుకునేందుకు అవకాశం ఉందని మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్ అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో నామినేషన్ దాఖలు చేసిన అభ్యర్థులు మంగళవారం మధ్యాహ్నం 3గంటల లోపు పలు పార్టీల పేరున నామినేషన్ వేసిన వారు మున్సిపల్ కార్యాలయంలో బిఫాం సమర్పించాలని ఆయన అన్నారు. నామినేషన్ ఉపసంహరించుకునే వారు నేడు మధ్యాహ్నం 3గంటల లోపు ఉపసంహరించుకోవాలని ఆయన తెలిపారు. రిజెక్ట్ అయిన మూడు నామినేషన్లు డిప్యూటీ డిస్ట్రిక్ట్ ఎలక్షన్ అథారిటీ ఆమోదించినట్లు ఆయన తెలిపారు. సోమవారం రోజున ఒకరు ఉపసంహరణ చేసుకున్నారు. మొత్తము అభ్యర్థులు 209 కాగా, రేపు మధ్యాహ్నం అనంతరం నామినేషన్ వేసిన అభ్యర్థులకు గుర్తులు కేటాయిస్తామన్నారు.

# తెలంగాణను రెండేళ్లలో దేశానికి రోల్‌మోడల్‌గా నిలబెట్టాం

- **మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి.**



హైదరాబాద్ / ఫిబ్రవరి 2 / అక్షరం న్యూస్ – :

తెలంగాణ రాష్ట్రాన్ని భారత దేశంలోనూ, ప్రపంచ స్థాయిలో అగ్రస్థానంలో నిలిపేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రైజింగ్ – 2047 విజన్ తో ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోంది'అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో ఇందిరమ్మ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఆరు గ్యారంటీల అమలుకు శ్రీకారం చుట్టాం'అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. ఏ మార్పు కావాలని తెలంగాణ ప్రజలు ప్రజాప్రభుత్వంపై విశ్వాసం ఉంచారో రెండేళ్లలోనే ఆ మార్పు స్పష్టంగా చూపించి ప్రజల విశ్వాసాన్ని నమ్మకాన్ని నిలబెట్టుకున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం నాడు సచివాలయంలోని తన ఛాంబర్లో ఆధునీకరించిన సమాచార పౌరసంబంధాల శాఖ వెబ్‌సైట్‌ను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. తమ ప్రభుత్వం అధికారం చేపట్టేనాటికి అన్ని రంగాలలోనూ మరీ ముఖ్యంగా ఆర్థికరంగంలో పెను సంక్షోభమని ఈ పరిస్థితుల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఒక్కోమెట్టు పేర్చుకుంటూ సంక్షోభం నుంచి గట్టెక్కుతూ అభివృద్ధి, సంక్షేమాన్ని పరుగులు పెట్టిస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ప్రజా ప్రభుత్వం తీసుకుంటున్న ప్రతి నిర్ణయం ప్రజల జీవితాలలో స్పష్టమైన మార్పునకు నాంది పలుకుతున్నాయని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. వ్యవసాయం, విద్య, వైద్యం, గృహ నిర్మాణం, సన్నబియ్యం, రేషన్ కార్డులు, ఉపాధి కల్పన వరకు అన్ని రంగాల్లో ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలు తెలంగాణను దేశానికి ఆదర్శంగా నిలుపుతున్నాయని మంత్రి అన్నారు. ఈ మార్పులను ప్రజలకు సమర్థవంతంగా చేరవేయడంలో ప్రజా సంబంధాల శాఖ పాత్ర అత్యంత కీలకం.ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని విరివిగా వాడుకొని ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ఎప్పటికప్పుడు వేగవంతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సమాచార శాఖ అధికారులకు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు. ప్రభుత్వ పాలనను రెండేళ్లు పూర్తి చేసుకుని మూడో వసంతంలోకి అడుగుపెట్టాం. రెండేళ్ల కాలం మరీ తక్కువే కానీ ప్రభుత్వం సాధించిన విజయాలు మాత్రం అత్యద్భుతం. రాష్ట్రంలో ఇందిరమ్మ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఆరు గ్యారంటీల అమలుకు శ్రీకారం చుట్టాం'అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు.'ఎన్నికల్లో హామీలు ఇవ్వకపోయినా ప్రజల సంక్షేమం కోసం పలు పథకాలను అమలు చేశాం అని వ్యవసాయ, పారిశ్రామిక రంగాలలో గణనీయమైన ప్రగతిని సాధిస్తున్నాం అని అన్నారు. ఆర్థికవృద్ధిలో తెలంగాణ రాష్ట్రం అగ్రస్థానంలో నిలిచింది. తెలంగాణ రాష్ట్రాన్ని భారత దేశంలోనూ, ప్రపంచ స్థాయిలో అగ్రస్థానంలో నిలిపేందుకు గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రైజింగ్ – 2047 విజన్ తో ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోంది'అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఒకవైపు ప్రపంచ నగరాలతో పోటీ పడే లక్ష్యాలను నిర్ధేశించుకొని మరోవైపు పేదల ఆకాంక్షలు తీర్చే సంక్షేమ ఫలాలు అందిస్తూ, ద్విముఖ వ్యూహంతో మా ప్రభుత్వం పాలన సాగిస్తోంది. పాలనలో పారదర్శకత, అభివృద్ధిలో ఆధునికత, సంక్షేమంలో సరికొత్త చరిత్రను రాస్తూ తెలంగాణను రెండేళ్లలో దేశానికి రోల్‌మోడల్‌గా నిలబెట్టాం'అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో ఐఅండ్‌పిఆర్ కమీషనర్ సిహెచ్. ప్రియాంక, ముఖ్యమంత్రి సీపీఆర్‌వో జి. మల్సూర్, సమాచార శాఖ అడిషనల్ డైరెక్టర్ డిఎస్ జగన్ , జాయింట్ డైరెక్టర్ రమణ తదితర అధికారులు పాల్గొన్నారు.



# అభిషేక్ శర్మ అత్యుత్తమ ఆటగాళ్లలో ఒకరిగా నిలుస్తారు

**ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్ జోస్యం**




2026 ఐసీసీ పురుషుల టీ20 ప్రపంచకప్‌లో భారత ఓపెనర్ అభిషేక్ శర్మ అత్యుత్తమ ఆటగాళ్లలో ఒకరిగా నిలుస్తారని ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్ జోస్యం చెప్పారు. ఈ ఎడమచేతి వాటం బ్యాటర్ టోర్నీలో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా నిలవడమే కాకుండా, 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్' అవార్డును కూడా గెలుచుకోవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. ఐసీసీ ఈవెంట్లలో పెద్దగా అనుభవం లేకపోవడం అభిషేక్‌కు ఒక రకంగా కలిసొస్తుందని పాంటింగ్ విశ్లేషించారు. 25 ఏళ్ల అభిషేక్ శర్మ ఫిబ్రవరి 7న ప్రారంభం కానున్న ఈ మెగా టోర్నీ ద్వారా తన టీ20 ప్రపంచకప్ అరంగేట్రం చేయబోతున్నాడు. "అతడొక స్టార్," అని ఐసీసీ రివ్యూ తాజా ఎడిషన్‌లో పాంటింగ్ పేర్కొన్నారు. "నిజం చెప్పాలంటే, అనుభవం లేకపోవడం అనేది అతనికి సానుకూల అంశం. అతను అత్యధిక పరుగులు చేయడమే కాకుండా, ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్ అయ్యే అవకాశం కూడా ఉంది" అంటూ పాంటింగ్ చెప్పుకొచ్చాడు. "అతను అంతటి ప్రతిభావంతుడని నేను నమ్ముతున్నాను. ఒకవేళ అతను రాణిస్తే భారత్‌ను ఓడించడం ఎవరికైనా కష్టమవుతుంది. అతను విఫలమైతే, భారత్ కూడా మిగతా జట్లలాగే ఒత్తిడికి లోనవుతుంది. అందుకే ఈ ప్రపంచకప్‌లో భారత్ తరపున అతను చాలా కీలకమైన ఆటగాడని నేను అనుకుంటున్నాను" అంటూ పొగడ్తల వర్షం కురిపించాడు. ఐపీఎల్ ప్రారంభ రోజుల్లో అభిషేక్ శర్మతో కలిసి పనిచేసిన అనుభవంతో, గ్లోబల్ స్టేజ్‌పై అతను ఒత్తిడికి గురికాడని పాంటింగ్ ధీమా వ్యక్తం చేశారు. "నేనే అతని మొదటి ఐపీఎల్ కోచ్‌ని," అని ఢిల్లీ క్యాపిటల్స్‌లో తన అనుభవాన్ని పాంటింగ్ గుర్తు చేసుకున్నారు. "నా హయాంలోనే అతను 17 ఏళ్ల వయసులో ఢిల్లీ తరపున అరంగేట్రం చేశాడు. మొదటి ఇఇఇఇబంతినే బౌలర్ తల పైనుంచి క్లాసికల్ షాట్‌తో ఫోర్ లేదా సిక్స్ కొట్టి తన ప్రత్యేకతను చాటుకున్నాడు. అప్పుడే అతనిలో ఏదో తెలియని అద్భుతమైన ప్రతిభ ఉందని నాకు అర్థమైంది" అంటూ చెప్పుకొచ్చాడు. అభిషేక్ శర్మను ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు నుంచి ట్రేడ్ చేయడాన్ని తాను తీవ్రంగా వ్యతిరేకించానని కూడా పాంటింగ్ వెల్లడించారు. "అతన్ని వదులుకోవద్దని నేను మేనేజ్‌మెంట్‌ను బతిమిలాడాను. ఒక అద్భుతమైన సూపర్‌స్టార్ తయారవుతున్నాడని చెప్పాను. ఇప్పుడు అది నిజమైంది" అంటూ తెలిపాడు. 2018 అండర్–19 ప్రపంచకప్ విజేత జట్టులో సభ్యుడైన అభిషేక్, ఇప్పుడు తన మొదటి సీనియర్ టీ20 ప్రపంచకప్ ఆడబోతున్నాడు. ఇటీవల న్యూజిలాండ్‌తో జరిగిన 4 మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో 152 పరుగులతో దుమ్మురేపాడు. మూడో మ్యాచ్‌లో కేవలం 14 బంతుల్లోనే అర్ధ సెంచరీ సాధించాడు. ఇది టీ20ల్లో భారత్ తరపున రెండో వేగవంతమైన హాఫ్ సెంచరీ. 2007లో ఇంగ్లాండ్‌పై 12 బంతుల్లోనే అర్ధ సెంచరీ చేసిన యువరాజ్ సింగ్ మాత్రమే అభిషేక్ కంటే ముందున్నాడు. వరుసగా రెండుసార్లు టీ20 ప్రపంచకప్ గెలిచిన తొలి జట్టుగా చరిత్ర సృష్టించాలనే భారత ప్రయత్నంలో అభిషేక్ కీలక పాత్ర పోషించనున్నాడు. గ్రూప్–ఎ లో ఉన్న భారత్, ఫిబ్రవరి 7న అమెరికాతో తన తొలి మ్యాచ్ ఆడనుంది.

# ఇండియా–ఎ జట్టును ప్రకటించిన బీసీసీఐ



టీ20 వరల్డ్ కప్ 2026 సమరానికి కౌంట్‌డౌన్ మొదలైంది. ఈ మెగా టోర్నీకి ముందు టీమిండియా సన్నాహకాల్లో భాగంగా రెండు వార్మప్ మ్యాచ్‌లు ఆడనుంది. దీని కోసం బీసీసీఐ సోమవారం (ఫిబ్రవరి 2) ఇండియా–ఎ జట్టును ప్రకటించింది. యువ సంచలనం తిలక్ వర్మ రీ–ఎంట్రీ ఇవ్వడం, ఐపీఎల్ స్పీడ్ స్టార్ మయాంక్ యాదవ్ జట్టులోకి రావడం ఈ స్క్వాడ్‌లో హైలైట్‌గా నిలిచింది. ఐసీసీ పురుషుల టీ20 ప్రపంచకప్ 2026 మరికొద్ది రోజుల్లో ప్రారంభం కానున్న నేపథ్యంలో టీమిండియా తన సన్నాహకాలను ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా అమెరికా, నమీబియాతో రెండు వార్మప్ మ్యాచ్‌లు ఆడనుంది. ఈ మ్యాచ్‌ల కోసం సీనియర్ ఆటగాళ్లకు విశ్రాంతినిస్తూ, యువ రక్తాన్ని పరీక్షించాలని బీసీసీఐ నిర్ణయించింది. ఢిల్లీకి చెందిన యువ బ్యాటర్ ఆయుష్ బదోనికి జట్టు పగ్గాలను అప్పగించింది. దేశవాళీ క్రికెట్‌లో, ఐపీఎల్‌లో అద్భుతంగా రాణిస్తున్న బదోనికి ఇది ఒక పెద్ద అవకాశం. తెలుగు క్రికెట్ అభిమానులకు గుడ్ న్యూస్ ఏంటంటే.. గాయం కారణంగా కొన్నాళ్లు దూరమైన తిలక్ వర్మ జట్టులోకి తిరిగొచ్చాడు. సర్జరీ తర్వాత కోలుకున్న తిలక్, ఫిట్‌నెస్ టెస్ట్ పాసై జట్టులో చేరాడు. అయితే ఇందులో ఒక చిన్న ట్విస్ట్ ఉంది. తిలక్ వర్మ ఇండియా–ఎ తరపున కేవలం ఒకే ఒక్క వార్మప్ మ్యాచ్ ఆడతాడు. ఆ మ్యాచ్‌లో తన ఫిట్‌నెస్‌ను నిరూపించుకున్న తర్వాత నేరుగా టీమిండియా(సీనియర్ జట్టు)లో చేరి వరల్డ్ కప్ ఆడతాడు. ఇది తిలక్ కెరీర్‌కు అత్యంత కీలకమైన సమయం. ఐపీఎల్‌లో 150 కిలోమీటర్లకు పైగా వేగంతో బంతులు విసిరి అందరినీ ఆశ్చర్యపరిచిన మయాంక్ యాదవ్ కూడా ఈ జట్టులో ఉన్నాడు. ఐపీఎల్ 2025లో ఆడిన తర్వాత గాయపడిన మయాంక్, సుదీర్ఘ విరామం తర్వాత బరిలోకి దిగుతున్నాడు. అతని వేగం టీమిండియాకు రాబోయే రోజుల్లో పెద్ద ఆస్తి కానుంది. మయాంక్ తో పాటు ఖలీల్ అహ్మద్, రవి బిష్ణోయ్ వంటి సీనియర్ బౌలర్లు కూడా ఈ జట్టులో ఉండటం విశేషం. ఇక రెండో మ్యాచ్ ఫిబ్రవరి 6 (శుక్రవారం) నమీబియాతో జరుగుతుంది. ఈ మ్యాచుల ద్వారా యువ ఆటగాళ్ల ఫామ్‌ను పరిశీలించి, అవసరమైతే మెయిన్ వరల్డ్ కప్ స్క్వాడ్‌లోకి ఎవరినైనా తీసుకునే అవకాశం ఉంది. రియాన్ పరాగ్, నమన్ ధీర్, అశుతోష్ శర్మ వంటి హిట్టర్లు ఈ జట్టులో ఉండటంతో మ్యాచ్‌లు రసవత్తరంగా సాగే అవకాశం ఉంది.